ఆడపిల్లగా పుట్టడమే నేరమా..?



కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన ఘటన దారుణం. ప్రభుత్వాలు ఎన్ని చెప్తున్నా, ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. సమాజంలో ఆడపిల్లగా పుట్టడమే నేరమాననే ఆవేదన కలుగుతోంది. ఇలాంటి ఘటనలు జరగకుండా వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. దోషులను తక్షణమే శిక్షించాలి.

– దివ్య, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్, సర్వజన ఆస్పత్రి

తప్పు చేయాలన్న ఆలోచనే రాకూడదు



సమాజంలో మహిళలు ఏదో ఒక రూపంలో దాడులకు గురవుతూనే ఉన్నారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడే వారిని అత్యంత కఠినంగా శిక్షించాలి. ఇలాంటి శిక్షలను చూసి తప్పు చేయాలంటే భయపడేలా చట్టాలను తీసుకురావాలి. వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– దీప్తి, జూనియర్ డాక్టర్

ప్రత్యేక చట్టంతోనే రక్షణ



మహిళలు, మహిళా డాక్టర్లపై వేధింపులకు పాల్పడే వారిని శిక్షించేందుకు ఇప్పుడున్న చట్టాలు చాలవు. మృగాళ్ల తరుముతుంటే యాప్‌లో వివరాలను నమోదు చేసేంత సమయం ఉండకపోవచ్చు. ఇలాంటి అకృత్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. పాఠశాల స్థాయి నుంచే బాలికలకు మానసిక ధైర్యంతో పాటు కరాటేను నేర్పించాలి.

– ప్రశాంతి, డాక్టర్, జీజీహెచ్



క్లుప్తంగా

గోశాలకు ఆవుల తరలింపు



నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న గోవులను గోశాలకు శనివారం తరలించారు. ఈ మేరకు కొత్తూరు, పద్మావతి సెంటర్, ఎస్పీ ఆఫీస్, కలెక్టర్ కార్యాలయం వద్ద సంచరిస్తున్న 12 ఆవులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లోకి ఎక్కించారు. అనంతరం కల్లూరుపల్లిలోని గోశాలకు తరలించారు. వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యానికి కృషి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

నెల్లూరు(అర్బన్): తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి కోరారు. చంద్రమౌళీనగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ ప్రాంతాల్లోని గర్భిణులను గుర్తించి వారి పేర్లను రిజిస్టర్ చేయాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించి మందులను ఇవ్వాలని కోరారు. వైద్యాధికారులు ఇమ్రాన్, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

పంపింగ్ స్కీమ్ హెవీ మోటార్ల చోరీ



పోలీసులకు ఆటోతో సహా పట్టుబడిన విద్యుత్ హెవీ మోటార్

పొదలకూరు : మండలంలోని దేగపూడి వద్ద కండలేరు పంపింగ్ స్కీమ్‌కు సంబంధించిన హెవీమోటార్లను ఆటోలో తరలిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. ముగ్గురు వ్యక్తులు ప్రయాణికుల ఆటోలో పంపింగ్ స్కీమ్ విద్యుత్ మోటార్‌ను తరలించసాగారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల కోసం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. దీనికి సంబంధించిన మరో మోటార్, సచివాలయం వద్ద ఉన్న వన్ హెచ్‌పీ మోటార్ సైతం చోరీకి గురైందని సెక్రటరీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండో హెవీ మోటార్ ఎక్కడ ఉందో తెలియాల్సి ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మోటార్లు చోరీకు గురవుతున్నాయి. అయితే పట్టుబడిన వారు దొంగలు కాదని ఎస్సై తెలిపారు. రోడ్డు పక్కన మోటార్ పడి ఉంటే ఆటోలో తరలిస్తుండగా తమకు పట్టుబడ్డారని వెల్లడించారు. అసలు దొంగల కోసం గాలిస్తున్నామన్నారు.

అనుమతుల్లేని లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు



పొదలకూరు : పట్టణానికి సమీపంలో నుడా అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్లలో శనివారం హెచ్చరిక బోర్డులను నాటారు. అనధికారిక లే అవుట్లలో ప్లాట్లు కొనరాదు, అమ్మరాదని పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. నుడా నుంచి వచ్చిన అధికారి కాలేషా స్థానిక సచివాలయ సెక్రటరీ వంశీతో కలిసి అనుమతి లేని శివాడ రాధారెడ్డి(1.16 ఎకరాలు), చెన్నారెడ్డి వెంకురెడ్డి(2.86 ఎకరాలు), మద్దినేని ప్రసాద్(4.10 ఎకరాలు), కొమ్మి సరోజనమ్మ(2.20 ఎకరాలు), కె.బ్రహ్మయ్య(0.99 ఎకరాలు) లేఅవుట్లలో బోర్డులను ఏర్పాటు చేశారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

• ఎస్పీ కృష్ణకాంత్



సిబ్బంది సమస్యలను తెలియజేస్తున్న ప్రసాద్‌రావు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ వెల్ఫేర్ డేను శనివారం ఆయన నిర్వహించారు. పోలీసుల కుటుంబసభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పోలీస్ కార్యాలయాధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలపై హెడ్‌క్వార్టర్స్‌లోని లైజనింగ్ అధికారితో మాట్లాడి వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. సిబ్బందికి సంబంధించిన పలు సమస్యలను ఎస్పీ దృష్టికి ఏపీ పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఏఎస్పీ సౌజన్య, పోలీస్ అధికారుల సంఘం నేత తురకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉత్సవ సమితి నేతలు



నెల్లూరు(దర్గామిట్ట): వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ ఆనంద్‌ను విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సత్యనాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఆయనకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం నేతలు మాట్లాడారు. గతేడాది తరహాలోనే ఈ ఏడాదీ సింగిల్ విండో పద్ధతిన అనుమతి పత్రాలను కార్పొరేషన్, పోలీస్, విద్యుత్, ఫైర్ శాఖలు జారీ చేసేలా చూడాలని కోరారు. మల్లికార్జునరెడ్డి, మహేష్, బండి ప్రసాద్, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, సుబ్రహ్మణ్యం, కొండపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత స్థాయి సమావేశం నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని విజయమహల్ గేట్ సెంటర్‌లో గల సాయికృష్ణ ఫంక్షన్ హాల్లో గణేశ్ ఉత్సవ మండపాల నిర్వాహకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం ఉదయం నిర్వహించనున్నామని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి తెలిపారు. వివరాలకు 94402 75274 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సింహపురి సంస్కృతి సమాఖ్య వార్షికోత్సవం రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని టౌన్‌హాల్లో సింహపురి సంస్కృతి సమాఖ్య వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి రాంజీ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని టౌన్‌హాల్లో మెజీషియన్ ఏకే రాయల్, విశపు లలితారామ్, ఉప్పు భాస్కర్‌తో కలిసి శనివారం ఆవిష్కరించిన అనంతరం రాంజీ మాట్లాడారు. విజయవాడకు చెందిన కూచిపూడి కళాకారిణి శ్రుతి సమన్వి నృత్య ప్రదర్శన జరగనుందని చెప్పారు. అదే విధంగా పలువుర్ని సత్కరించనున్నామని పేర్కొన్నారు.

నేటి నుంచి ద్వారకామాయి వార్షికోత్సవ వేడుకలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిర సాయి మాత నిత్యాన్నప్రసాదాలయం ద్వారకామాయి తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓంసాయి శ్రీసాయి జయజయ సాయి నామ సంకీర్తనను ఆదివారం .. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత పెనుశిల లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వెంకటాద్రి ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాగుంట లేఅవుట్, పిచ్చిరెడ్డి కల్యాణ మండపం, అన్నమయ్య సర్కిల్, లెక్చరర్స్ కాలనీ, కింగ్స్‌కోర్టు అవెన్యూ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

బకాయిల మంజూరుకు వినతి

నెల్లూరు(దర్గామిట్ట): తమకు గతంలో ఉన్న బకాయిలను వెంటనే మంజూరు చేసేలా సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రి చొరవ చూపాలని నెల్లూరు రైస్ మిల్లర్స్, డీలర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటనను విడుదల చేశారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ అడ్వాన్స్ చెక్కు అందజేత



నెల్లూరు(దర్గామిట్ట): అనారోగ్యంతో బాధపడుతున్న బుచ్చిరెడ్డిపాళెం రీసర్వే డీటీ కామాక్షి, కోట ఆర్ఐ ప్రశాంత్‌కు మెడికల్ రీయింబర్స్‌మెంట్ అడ్వాన్స్ కింద రూ.రెండు లక్షల మేర చెక్కులను కలెక్టర్ ఆనంద్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు నిధులను మంజూరు చేసిన కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో లవన్న, కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలను తెలియజేశారు. అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు పెంచలరెడ్డి, డానియెల్ పీటర్, మురళి, గోపీకృష్ణ, ప్రదీప్, బాలకోటమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

చిత్రకళా వర్క్‌షాపులో నెల్లూరీయుడి ప్రతిభ



నెల్లూరు(బృందావనం): కోల్‌కతాలోని శాంతినికేతన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్ట్ వర్క్‌షాపులో నెల్లూరుకు చెందిన చిత్రకారుడు సుందర్‌బాబు ప్రతిభ చూపారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం ఆయన తెలియజేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఆర్ట్ వర్క్‌షాపును సొసైటీ ఫర్ ప్రాబల్‌ప్రామాణిక్స్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, రూపయాన్ మల్టీమీడియా స్టూడియో, పబ్లికేషన్ హౌస్ నిర్వాహకుడు అరూప్ చంద్ర ఆధ్వర్యంలో ఈ నెల 16, 17న నిర్వహించారని చెప్పారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు వివిధ దేశాలకు చెందిన చిత్రకారులు హాజరయ్యారని పేర్కొన్నారు. సరస్వతీ అమ్మవారి రూపాన్ని మోడరన్ ఆర్ట్‌లో చిత్రీకరించానన్నారు. తనకు ప్రశంసపత్రాన్ని అందజేసి సత్కరించారని వివరించారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం



నెల్లూరు(బృందావనం): కొత్తూరులోని వెంకయ్య స్వామి ఆశ్రమంలో వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. హోమాలు, అన్నాభిషేకం, విశేష ద్రవ్యాలతో అభిషేకం తదితరాలను జరిపారు. పండరి భజనలు, కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దు



వినతిపత్రమిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ప్రదోషకాల పూజలు చేసే భక్తుల మనోభావాలను దేవదాయ అధికారులు గౌరవించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని దేవదాయ శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని శనివారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రదోషకాల పూజ అనంతరం మూలస్థానేశ్వరుడికి అభిషేక సమయంలో అంతరాలయ దర్శనానికి రూ.50 టికెట్ లేదనే కారణంతో భక్తులను అనుమతించడంలేదని ఆరోపించారు. నేతలు నాగేంద్రసింగ్, నరాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



బహుమతుల ప్రదానం

నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలను జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈఓ రామారావు హాజరయ్యారు. వింజమూరు జెడ్పీ హైస్కూల్, సంగం జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. వీరికి బహుమతులుగా రూ.ఏడు వేలు, రూ.ఐదు వేలను అందజేశారు. హరిబాబు, విజయప్రసూన, సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, ఎన్జీసీ కోఆర్డినేటర్ భక్తవత్సలనాయుడు, హెచ్‌ఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేయాలంటూ ధర్నా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేయడంతో పాటు భద్రత చర్యలు చేపట్టాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉమ్మారెడ్డిగుంట వద్ద గల ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను శనివారం చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, నగర, రూరల్ కార్యదర్శులు నాగేశ్వరరావు, కిన్నెరకుమార్, నేతలు పెంచలనరసయ్య, అల్లాడి గోపాల్, ప్రసాద్, మురళి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా క్రికెట్ పోటీలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తాటిపర్తి సునీల్‌కుమార్ జ్ఞాపకార్థం బుజబుజనెల్లూరులోని సీఐఏ క్రికెట్ మైదానంలో వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ టీ – 20 పోటీలు హోరాహోరాగా సాగాయి. పూల్ ఏ నుంచి నెల్లూరు, పూల్ బీ నుంచి గుంటూరు జట్లు ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఫైనల్స్ ఆదివారం జరగనుందని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ఆనందం



కర్లపూడి కృష్ణ దంపతులకు సత్కారం

నెల్లూరు(బృందావనం): ఆధ్యాత్మిక చింతనతోనే ఆనందాన్ని పొందగలమని ఆధ్యాత్మికవేత్త కర్లపూడి కృష్ణ పేర్కొన్నారు. ఆనందంగా జీవించడంలో ఆధ్యాత్మికత అనే అంశంపై టౌన్‌హాల్ ప్రాంగణంలోని వర్ధమాన సమాజ రీడింగ్ రూమ్‌లో శనివారం ఆయన ఉపన్యసించారు. అనంతరం కృష్ణ దంపతులను సత్కరించారు. చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుడు యజ్ఞావఝుల శేషగిరీశం, రచయిత రాజేంద్రకుమార్, రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



రత్నం స్కూల్లో..



భాష్యం స్కూల్లో..



కిడ్జీ స్కూల్లో..

నెల్లూరు (టౌన్): నగరంలోని పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. సరస్వతీనగర్‌లోని కిశోర్స్ రత్నం స్కూల్లో విద్యార్థులు రాధ, గోపిక వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపల్స్ మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

➡ చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులోని మౌంట్ లిటరా కిడ్జీ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపల్ రూపశ్రీ తదితరులు పాల్గొన్నారు.

➡ బాలాజీనగర్‌లోని భాష్యం స్కూల్లో రాధ, గోపిక వేషధారణలతో విద్యార్థులు అలరించారు. అనంతరం ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్, లిటిల్ చాంప్స్ ఇన్‌ఛార్జి అస్మాతాజ్ తదితరులు పాల్గొన్నారు.

➡ బాలాజీనగర్‌లోని నలంద స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఫహీం, ప్రిన్సిపల్ కిరణ్, ప్రధానోపాధ్యాయురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ క్యాంపునకు 'డీకేడబ్ల్యూ' విద్యార్థి



నెల్లూరు (టౌన్): ముంబైలో నిర్వహించనున్న ఆలిండియా నౌ సైనిక్ క్యాంపునకు షిప్ మోడలింగ్ విభాగంలో నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ నావెల్ యూనిట్ నుంచి విద్యార్థిని వెంకటరమణ ఎంపికైందని ప్రిన్సిపల్ గిరి తెలిపారు. కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. సహకారం అందించిన 10ఏ నావల్ యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ గణేశ్, షిప్ మోడలింగ్ ఇన్‌స్ట్రక్టర్ రామన్‌ను అభినందించారు. పీఐ స్టాఫ్ వెంకటేష్ రాథోడ్, సుధాకర్, లోకేష్, నావల్ యూనిట్ కేర్ టేకర్ దివ్య పాల్గొన్నారు.

సేవల్లో ముందుండాలి



విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

నెల్లూరు (టౌన్): సేవా కార్యక్రమాల్లో ముందుండాలని జీఎస్టీ (ఆడిట్) కమిషనర్ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పేదలకు సాయం చేసేందుకు కులమతాలకతీతంగా ముందుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలను అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్, నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌ఓడీ కణ్ణన్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, ఏఆర్కే చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి కృపావతి, కోశాధికారి హనోక్, సభ్యులు మురళి, బాలయ్య, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.